వీడని చెత్త.. వేధిస్తున్న విషజ్వరాలు

గత వారం నగరంలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో పల్లపు ప్రాంతాలతో పాటు ఖాళీ ప్రదేశాలు, ప్లాట్ల నిండా నీరు నిల్వ చేరింది. వీటికి తోడు నివాసాల మధ్య పేరుకుపోయిన చెత్త మూలంగా దోమల విజృంభణ మొదలైంది. దీంతో విషజ్వరాలతో పాటు డెంగీ, మలేరియా వంటి వ్యాధులు, డయేరియా జబ్బులు ప్రబలుతున్నాయి.

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న నగర ప్రజలు
- అధ్వానంగా చెత్త నిర్వహణ
- ఖాళీ ప్రదేశాల్లో తొలగని వర్షపు నీరు
- ఫలితంగా దోమల ఉధృతి, జ్వరాలు



బుజబుజనెల్లూరు రామ్‌నగర్ పదో వీధిలో పేరుకుపోయిన చెత్త



శంకర అగ్రహారంలో ఓ ఆస్పత్రి వద్ద రక్తపరీక్షల కోసం వచ్చిన రోగులు

నెల్లూరు(అర్బన్) : నగరంలోని అనేక ప్రాంతాల్లో విషజ్వరాలు వేగంగా ప్రబలుతున్నాయి. భారీ వర్షాలకు నిలిచిన వర్షపునీరు ఇప్పటికీ తొలగిపోవడం లేదు. ప్రధానంగా శివారు ప్రాంతాలైన బుజబుజనెల్లూరు, పడారుపల్లి, కల్లూరుపల్లి, హౌసింగ్ బోర్డు కాలనీ, ఆర్టీసీ కాలనీ, తల్పగిరి కాలనీ, టైలర్స్ కాలనీ, చౌటమిట్ట, కొత్తూరు, మన్సూర్‌నగర్, మనుమసిద్ధినగర్, జనార్దన్‌రెడ్డి కాలనీ, గాంధీగిరిజన సంఘం, అల్లీపురం, డ్రైవర్స్ కాలనీ, అనగుంట, ఇరగాళమ్మ గుడి, శివగిరి కాలనీ తదితర పల్లపు ప్రాంతాల్లో ఇళ్ల చుట్టూ ఖాళీ ప్లాట్ల నిండా వర్షపు నీరు చేరిపోయింది. నీరు బయటకు వెళ్లేందుకు మార్గాలు లేక దోమలు పెరిగాయి. నగరంలోని మాగుంట లేఅవుట్, హరనాథపురం విస్తరిత ప్రాంతాలు, చింతారెడ్డిపాళెం, బలిజపాళెం తదితర ప్రాంతాల్లోని ఖాళీ ప్లాట్లలో సైతం వర్షపు నీరు నిలబడిపోయింది.

అధ్వానంగా పారిశుద్ధ్యం

మరో వైపు పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఇళ్ల చుట్టూ చెత్త పేరుకుపోయింది. భగత్‌సింగ్ కాలనీ, శివాజీనగర్, అంబేడ్కర్ నగర్, ఖుద్దూస్ నగర్ తదితర అన్ని ప్రాంతాల్లో చెత్తతో కూడిన వర్షపు నీరు నిలబడిపోయింది.

జ్వరాలతో విలవిల

నగరంలో అధ్వాన పారిశుద్ధ్యం, దోమల ఉధృతితో జ్వరాలు పెరిగాయి. ప్రతివీధిలో విషజ్వరాలతో అల్లాడుతున్నారు. దీంతో నగరంలోని ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. సాధారణ జ్వరంతో ఆస్పత్రికి వెళ్లినా డాక్టర్లు పలురకాల రక్త పరీక్షలు, ఎక్స్‌రేలు, స్కానింగ్‌లు చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 105 డెంగీ కేసులు, 4 మలేరియా కేసులు మాత్రమే నమోదయ్యాయని వైద్యశాఖాధికారులు ప్రకటిస్తున్నప్పటికీ వాస్తవానికి అందుకు భిన్నంగా ఉంది. నగరంలోని జయభారత్, రామచంద్రారెడ్డి ఆస్పత్రి, నారాయణ, మెడికవర్, కిమ్స్, అపోలో తదితర ఆస్పత్రుల్లో డెంగీ కేసులు ప్రతిరోజూ పదుల సంఖ్యలో నమోదవుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, వైద్యశాఖాధికారులు సమన్వయంతో పనిచేస్తూ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, విషజ్వరాలను నియంత్రించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

దోమలతో అల్లాడుతున్నాం



తమ ప్రాంతంలో వర్షపు నీరు నిలబడిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగాయి. పగటిపూట కూడా ఆరుబయట ఇళ్ల వద్ద కూర్చోలేకపోతున్నాం. దోమకాటుకు పెద్ద దద్దుర్లు వస్తున్నాయి. ఇళ్ల చుట్టూ ఉండే నీరు బయటకు పంపేలా అధికారులు కృషి చేయాలి. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమలను నిర్మూలించాలి.

– డి.శ్రీనివాసులు, ఆర్టీసీ కాలనీ, నెల్లూరు

ఫాగింగ్ చేయాలి



వర్షాలకు దోమలు పెరిగాయి. వాటి నివారణకు ఫాగింగ్ పొగను రెగ్యులర్‌గా అన్ని ప్రాంతాల్లో వదలాలి. అలాగే చెత్తను ప్రతిరోజు తొలగించాలి. జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలి.

– బీబీ జాన్, బుజబుజనెల్లూరు



రాజరాజేశ్వరి ఆలయ సమీపంలో పేరుకున్న చెత్త



రామ్‌నగర్‌లో ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్త



ఆర్టీసీ కాలనీ వద్ద నిలిచిన వర్షపునీరు

క్లుప్తంగా

ఆర్చరీ పోటీల్లో గోష్మితారెడ్డి ప్రతిభ



గోల్డ్‌మెడల్ సాధించిన గోష్మితారెడ్డి

నెల్లూరు (టౌన్) : ఇటీవల బెంగళూరులో జరిగిన సౌత్‌జోనల్ స్థాయి ఆర్చరీ పోటీల్లో అవెన్యూ స్కూల్ విద్యార్థి జి.గోష్మితారెడ్డి గోల్డ్‌మెడల్ సాధించినట్లు స్కూల్ కరెస్పాండెంట్ కృష్ణచైతన్య తెలిపారు. స్థానిక అవెన్యూ స్కూల్‌లో విద్యార్థిని సోమవారం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవరాత్రి మహోత్సవాలను జయప్రదం చేశాం

- రాజరాజేశ్వరి దేవస్థానానికి పెరిగిన ఆదాయం



మాట్లాడుతున్న జిల్లా దేవదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు జరిగిన శరన్నవరాత్రి మహోత్సవాలను అందరి సమన్వయంతో జయప్రదం చేశామని ఆ దేవస్థానం ఈఓ, జిల్లా దేవదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. రాజరాజేశ్వరి దేవస్థానంలో హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. అందుకు సంబంధించిన వివరాలను ఫెస్టివల్ కమిటీ చైర్మన్ అశోహరి విజయకుమార్, సభ్యులతో కలిసి వెల్లడించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 17 నుంచి అక్టోబరు 21వ తేదీ వరకు భక్తులు కానుకల రూపంలో రూ.29,11,771, అన్నదాన హుండీ ద్వారా రూ.99,138తో కలిపి మొత్తం రూ.30,10,909 అందించారన్నారు. కాగా గతేడాది మహోత్సవాలకు రూ.79,05,873 రాగా, ఈ ఏడాది రూ.93,77,164 లభించాయన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.14,71,291 ఆదాయం అధికంగా వచ్చిందన్నారు

గుర్రపు డెక్కను తొలగించాలి



పంట కాలువలను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : పంట కాలువల్లో గుర్రపు డెక్కను తొలగించాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. నగరంలోని వివిధ పంట కాలువలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వరినాట్లు వేసే సమయం ఆసన్నమైందని, ఈ క్రమంలో గుర్రపు డెక్క, సిల్ట్ తొలగింపు పనులను చేపట్టాలన్నారు. అదేవిధంగా జాఫర్ సాహెబ్ కెనాల్, సర్వేపల్లి కాలువ, కృష్ణపట్నం కాలువ, వల్లూరు కాలువ, కనుపూరు కాలువ, సదరన్ చానల్, ఈస్టర్న్ చానల్‌లలో పూడికతీత చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పైడిమాని ఆదినారాయణ, రత్నం నాయుడు, పొట్టి శివకుమార్, నారాయణరావు పాల్గొన్నారు.

లక్ష దీపోత్సవానికి అంకురార్పణ



నెల్లూరు(బృందావనం) : నగరంలోని వీఆర్సీ మైదానంలో నవంబరు 8, 9, 10వ తేదీల్లో జరుగనున్న కార్తీకమాస లక్ష దీపోత్సవానికి సోమవారం అంకురార్పణ జరిగింది. వీపీఆర్ ఫౌండేషన్, కార్తీకమాస లక్ష దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి సంబంధించి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి భూమి పూజ చేసి గుంజ ప్రతిష్ఠ గావించారు. పవన్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కంజర్ల భాస్కరశర్మ, విజయసారథి, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆత్మకూరును అభివృద్ధి చేస్తా

నెల్లూరు(సెంట్రల్) : ఆత్మకూరును అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో నాయకులు, ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం 26 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.

సన్మానం



నెల్లూరు(బృందావనం) : నగరంలోని పుర మందిరంలో ఏవీకే ఫౌండేషన్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో మహేంద్ర మేదర సంఘం నాయకుడు పోలేపల్లి శ్రీనివాసులును సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో పేరూరి ప్రదీప్, నాగినేని ప్రభాకర్ పాల్గొన్నారు.

రవివర్మకు అభినందన



నెల్లూరు సిటీ : రాష్ట్ర పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవివర్మకు ది పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య, రాష్ట్ర కమిటీ నేత కేవీరెడ్డి సోమవారం అభినందనలు తెలిపారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంజినీరింగ్ చెంగల్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆపరేషన్ అప్పలరాజులకు శాలువ కప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న మారుతీదేవి

నెల్లూరు(సెంట్రల్) : సాగులో తగిన జాగ్రత్తలు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు మారుతీదేవి అన్నారు. నగరంలోని జిల్లా వనరుల కేంద్రంలో నెల్లూరు రూరల్, వెంకటాచలం, సైదాపురం ప్రాంతాలకు చెందిన వ్యవసాయ సహాయకులకు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు.

వైన్‌షాపును తొలగించాలి



వైన్‌షాపు వద్ద స్థానికుల నిరసన



స్థానికులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు

- స్థానికుల ఆందోళన

నెల్లూరు(క్రైమ్) : జగదీష్‌నగర్ ఏడో వీధిలో నివాసాల మధ్య ఏర్పాటు చేసిన వైన్‌షాపును తొలగించాలని పెద్ద సంఖ్యలో స్థానికులు ప్లకార్డులు పట్టుకుని సోమవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. చిల్డ్రన్స్‌పార్కు వైపు నుంచి హైవే మీదుకు వెళ్లే వాహనాలను అడ్డుకుని గంటకుపైగా నిరసన వ్యక్తం చేశారు. బాలాజీనగర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని స్థానికులకు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా వారు పట్టించుకోలేదు. వెంటనే దుకాణాన్ని మూసివేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు ఘటనా స్థలానికి చేరుకుని ఎక్సైజ్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు నిరసన విరమించారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

నివాసాల మధ్య వైన్‌షాప్‌ను ఏర్పాటు చేయడం వల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక మహిళలు వాపోయారు. పలువురు రోడ్డుపైనే వాహనాలు నిలుపుకుని మద్యం సేవిస్తున్నారని, అటుగా వెళ్తున్న వారిపట్ల వెకిలిగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ ప్రాంతం నుంచి వైన్‌షాపు తొలగించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

సమస్యలను హెల్ప్‌లైన్‌కు తెలియజేయండి

- కమిషనర్ సూర్యతేజ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : స్థానిక సమస్యలను కార్పొరేషన్ హెల్ప్‌లైన్‌కు తెలియజేస్తే తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని నగర కమిషనర్ సూర్యతేజ అన్నారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. నిర్ణీత సమయంలోగా పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా మొత్తం 18 అర్జీలు వచ్చినట్లు తెలియజేశారు. ప్రజలు తమ సమస్యలను 94940 18118 నంబర్‌కు వాట్సాప్ ద్వారా లేదా 0861–2356777, 0861–2316777 హెల్ప్‌లైన్ నంబర్లకు తెలియజేయాలని కోరారు. అదనపు కమిషనర్ శర్మద, ఎస్ఈ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ కృష్ణకిశోర్ పాల్గొన్నారు.

లౌకికవాదాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్



ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నేతలు

- లడ్డూపై రాజకీయాలు ఆపి అభివృద్ధిపై దృష్టి పెట్టాలి
- ముగిసిన సీపీఎం నగర మహాసభలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రాష్ట్రంలో లౌకికవాదాన్ని కాపాడాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక బాలాజీనగర్‌లో సీపీఎం 25వ నగర మహాసభలు సోమవారంతో ముగిశాయి. తొలుత పార్టీ నేతలు నగరంలోని పూలే విగ్రహం నుంచి బాలాజీనగర్‌లోని మెయిన్ రోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నారావారి సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. భవిష్యత్తులో తీసుకోవాల్సిన విధివిధానాలపై 25 తీర్మానాలు చేశామన్నారు. బీజేపీ మతోన్మాద దాడులకు పాల్పడుతోందని, జమిలీ ఎన్నికలతో దేశాన్ని హస్తగతం చేసుకోవాలని చూస్తోందని ఆరోపించారు. సీఎం చంద్రబాబు తిరుమల లడ్డూ వ్యవహారాన్ని పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. పెన్నా బ్యారేజీకి ఎగువ, దిగువ ప్రాంతాల్లో వరద ముంపునకు గురికాకుండా పొర్లుకట్టలు నిర్మించాలని, కాలువ కట్టలపై ఉన్న పేదలకు ఇళ్ల పట్టాలు అందించాలని కోరారు. నగరంలో ఉన్న ప్రధాన పంట కాలువలకు పూడికలు తీయాలన్నారు.

నగర కమిటీ ఏర్పాటు

సీపీఎం నూతన నగర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగర కార్యదర్శిగా కత్తి శ్రీనివాసులు, కార్యదర్శి వర్గ సభ్యులుగా జి.నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, సూరినారాయణ, ఆర్.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాధారణ సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరు సిటీ : ఈనెల 23వ తేదీ(రేపు) ఉదయం 10.30 గంటలకు రూరల్ మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శైలేంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూరల్ ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

అడిషనల్ కమిషనర్‌గా నందన్



నందన్

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్(ఎన్ఎంసీ) అదనపు కమిషనర్‌గా వైఓ నందన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా నందన్‌ను ఎన్ఎంసీ అదనపు కమిషనర్‌గా నియమించారు. ఇప్పటివరకు ఎన్ఎంసీ అదనపు కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శర్మదను డీఎంఏకు బదిలీ చేశారు.

తిరుమలపై రాజకీయాలు హేయం



మాట్లాడుతున్న బీసీవై నగర ఇన్‌చార్జి మహేష్‌వర్మ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : సీఎం చంద్రబాబు తిరుమలపై రాజకీయాలు చేయడం హేయమని భారత చైతన్య యువజన పార్టీ(బీసీవై) నెల్లూరు నగర ఇన్‌చార్జి కాళహస్తి వెంచు మహేష్‌వర్మ అన్నారు. నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడారు. తిరుమల పవిత్రత, పరిరక్షణే తమ పార్టీ ధ్యేయమని పేర్కొన్నారు. తిరుమల లడ్డూ వివాదాన్ని పరిష్కరించకుండా రాజకీయాలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు దినేష్‌యాదవ్, సోమాగోపాల్, దివ్యతేజవర్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు



నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

బరితెగిస్తున్న టీడీపీ నేతలు

- ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు) : టీడీపీ నేతలు బరితెగించి ఆక్రమణలు చేపడుతున్నారని, తాజాగా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన పార్కు స్థలంలో ఆక్రమణలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నగరంలోని 13వ డివిజన్, హెచ్‌పీ గోడౌన్ సమీపంలో నాలుగు పార్కుల సెంటర్ వద్ద పార్కు ముందు చేపడుతున్న అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సదరు కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ సోమవారం ఎన్ఎంసీ కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 13వ డివిజన్‌లో ప్రజలకు ఉపయోగపడే పార్కు స్థలంలో అర్ధరాత్రి జరుపుతున్న ఆక్రమ నిర్మాణాలపై వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా పార్కు స్థలాన్ని సంరక్షించే విధంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ ప్రజలకు ఇంతవరకు ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. మంత్రి నారాయణ నెల్లూరు నగర అభివృద్ధిపై ఇచ్చిన హామీలను కూడా పక్కన పెట్టారని విమర్శించారు. ఇవేమీ పట్టించుకోకుండా టీడీపీ నేతలు నెల్లూరులో ప్రజలకు ఉపయోగపడే స్థలాల ముందు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలకు ఆహ్లాదం పంచే పార్కుల్లో ఇష్టారీతిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం దారుణమన్నారు. దీనిపై కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో తామే ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నీలి రాఘవరావు, పార్టీ నాయకులు నేతాజీ సుబ్బారెడ్డి, అబ్దుల్ మస్తాన్, మాబాషాతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్లను తొలగించాలని చూడడం దారుణం



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు) : ప్రభుత్వం పేదల ఇళ్లను తొలగించాలని చూడడం దారుణమని వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నగరంలోని 48వ డివిజన్ పొర్లుకట్ట వద్ద టీడీపీ నేతలు దౌర్జన్యంగా ఇళ్లను ఖాళీ చేయించడం గురించి తెలుసుకున్న ఆయన సోమవారం బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొర్లుకట్ట ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా ఉంటున్న పేదలు నివాసాలను అర్ధరాత్రి వేళ కూల గొట్టాలనుకోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేదలకు న్యాయం చేయాలని కోరారు. లేదంటే వైఎస్సార్‌సీపీ ప్రజల కోసం ఉద్యమిస్తుందన్నారు. పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజాహుస్సేని, కార్పొరేటర్లు ఊటుకూరు నాగార్జున, వేలూరు మహేష్, నీలి రాఘవరావు, పార్టీ నేతలు నేతాజీ సుబ్బారెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌ను నిర్మూలిద్దాం



కేన్సర్‌ను జయించిన మహిళకు బహుమతిని అందిస్తున్న డాక్టర్ నాగేశ్వరరావు

నెల్లూరు(అర్బన్) : తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా స్త్రీలలో రొమ్ము కేన్సర్‌ను నిర్మూలించవచ్చని ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పలువురు డాక్టర్లు పేర్కొన్నారు. నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో రొమ్ము కేన్సర్‌ను జయించిన వారితో, ప్రస్తుత రోగులతో కలిసి అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు దీనిపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, రేడియో అంకాలజిస్ట్ డాక్టర్ గీతాఉషశ్రీ మాట్లాడుతూ జంక్ ఫుడ్స్ తీసుకోవడం, కాలుష్యం, ప్లాస్టిక్ వస్తువులను ఎక్కువగా వినియోగించడం, తగిన వ్యాయామం లేని ఫలితంగా రొమ్ము కేన్సర్ వస్తోందన్నారు. 40 ఏళ్లు నిండిన ప్రతి మహిళ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం కేన్సర్‌ను జయించిన వారికి బహుమతులు అందించారు. డాక్టర్లు హేమంత్, హరితరాణి, నందిత, పేషెంట్ కౌన్సెలర్ కన్యాకుమారి, ఇన్‌స్టిట్యూట్ జనరల్ మేనేజర్ భక్తవత్సలరెడ్డి, రెడ్‌క్రాస్ ఎంసీ మెంబర్ వాకాటి విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.